జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 21 | డిసెంబర్ | 2025 ◆ పేజీలు : 4




# జిల్లాలో రహదారి భద్రతకు పటిష్టమైన చర్యలు

**జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 20, ప్రజా జ్యోతి:** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జనవరి నెలలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రహదారి ప్రమాదాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతుండటంతో పాటు పలువురు గాయాల పాలవుతున్నారని, దీని వల్ల బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని మృతి చెందితే అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల బాధలు వర్ణనాతీతమని,. రహదారి ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నందున వాటి నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రవాణా, పోలీస్, అబ్కారి,

మిగతా 2 లో...



**ఈసారి సింగరేణి డే సాదాసీదాగానేనా?**




# గొప్పల సింగరేణి... వేడుకలకు వెనకడుగు

2 లో..

136 సంవత్సరాల చరిత్ర ఉన్న సంస్థ.. ఒకే ఏడాదిలో రూ.6,000 కోట్ల లాభం సాధించిన సంస్థ. ఒక వైపు ఉద్యోగులకు లాభాల పంపకం. మరోవైపు కోట్ల రూపాయల సీఎస్ ఆర్ కార్యక్రమాలు. సివిల్స్ కు సిద్ధమయ్యే విద్యార్థులకు లక్ష రూపాయల సాయం.. ప్రపంచ స్థాయి వ్యాపార విస్తరణ ప్రణాళికలు. రాగి, బంగారు గనుల తవ్వకాల దిశగా కొత్త అడుగులు. ఇది మొత్తంగా చెప్పాలంటే సిరుల మాగాణి చరిత్ర. ఇంత గొప్పగా ముందుకు సాగుతున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన సొంత పండుగ లాంటి 'సింగరేణి డే' విషయంలో మాత్రం ఈసారి కాస్త వెనకడుగు వేసినట్టు కనిపిస్తోంది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# రాజుపేటలో కార్డన్ సెర్చ్



**భద్రాచలం, డిసెంబర్ 20,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని రాజుపేట కాలనీలో శనివారం పట్టణ పోలీసుల ఆద్వర్యంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో సీఐ నాగరాజు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కాలనీల్లో జరిగిన కార్డన్ సెర్చ్ లో పాల్గొన్నారు. ఈ సమయంలో పలువురి ఇళ్లల్లో సోదాలు నిర్వహిచేడంతో పాటు వారి వివరాలను, తగిన గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 60 ద్విచక్ర వాహనాలు, ఆరు మద్యం కాటన్స్‌ను పట్టుకున్నారు. ఎఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ భద్రాచలంలో ఇకపై ఆకస్మిక తనికీలు నిర్వహిస్తూ ఉంటామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## భద్రాద్రిలో ప్రారంభమైన

# వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు

**మత్స్యావతారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య**

**వైదిక సిబ్బందికి దీక్ష వస్త్రాలు అందజేసిన ఏఈవో**

**నేడు కూర్మావతరంలో రామయ్య**



**భద్రాచలం, డిసెంబర్ 20,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం నుంచి ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయంలో ఉదయం మూలవరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు మత్స్యావతారం అలంకరణ చేసి నిత్యకల్యాణ వేదిక వద్దకు తీసువచ్చారు. ఈ సమయంలో విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, విశేష అర్చన, పూజలను నిర్వహించారు. అనంతరం వైకుంఠ ఏకాదశి

మిగతా 2 లో...

# జిల్లాలో రహదారి భద్రతకు పటిష్టమైన చర్యలు

(మొదటి పేజీ తరువాయి... )

ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు సమన్వయంతో జనవరి నెలలో నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లాలో రహదారి భద్రతకు సంబంధించి చేపడుతున్న చర్యలపై వివరించారు. జిల్లాలో రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారుల వెంట ఏర్పడే గుంతలను పూడ్చేందుకు గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్మికుల ద్వారా ఎప్పటికప్పుడు మరమ్మత్తుల కార్యక్రమం చేపడుతున్నామని వెల్లడించారు.జిల్లాలో రహదారులపై ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదాల నివారణకు సిసి కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులను గుర్తించి తగిన చర్యలు తీసుకునేలా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే విధంగా తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మెరుగైన అత్యవసర వైద్య సేవల కోసం జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా నూతనంగా మూడు బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగిందని, రహదారి ప్రమాదాల సమయంలో బాధితుల ప్రాణాలను కాపాడడంలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయని ఆయన అన్నారు.జనవరి నెలలో నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం తీసుకురావడానికి అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ మురళి, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు





(మొదటి పేజీ తరువాయి... )

అధ్యయనోత్సవాల్లో పాల్గొనే వైదిక సిబ్బందికి దీక్ష వస్త్రాలను లను దేవస్థానం ఏఈవో శ్రావణ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం స్వామి వారిని భాజభజంత్రీలు, భక్తమండళ్ల కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్దకు స్వామి వారిని తీసుకొచ్చారు. ఈసమయంలో దేవస్థానం ఏఈవోలు శ్రావణ్ కుమార్, భవానీరామకృష్ణ, ఇతర సిబ్బంది దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారిని భక్తులు దర్శించుకోగా, మరో వేదిక వద్ద భద్రాద్రి రామాలయ ప్రాశస్యం, భక్తరామదాసు కీర్తనలను ఆలపించారు. చివరగా స్వామి వారిని తొలి రోజు తిరువీధి సేవకు తీసుకెళ్లారు. రామాలయం పరిసరాలు, రాజవీధి, తాతగుడి సెంటరు మీదుగా గోవిందరాజస్వామివారి ఆలయంకు చేరుకొని కొద్దిసేపు భక్తులు దర్శించుకున్న అనంతరం తిరిగి స్వామి వారు రామాలయంకు చేరుకున్నారు. నేడు స్వామి వారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇదిలా ఉండగా అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 29 వరకు పగల్ పత్తు ఉత్సవాలు, 30 నుంచి రాపత్తు ఉత్సవాలు నిర్వహించనున్నారు. స్వామి వారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తారు.

**ఈసారి సింగరేణి డే సాదాసీదాగానేనా?**




# గొప్పల సింగరేణి... వేడుకలకు వెనకడుగు

**136 సంవత్సరాల చరిత్ర ఉన్న సంస్థ.. ఒకే ఏడాదిలో రూ.6,000 కోట్ల లాభం సాధించిన సంస్థ. ఒక వైపు ఉద్యోగులకు లాభాల పంపకం. మరోవైపు కోట్ల రూపాయల సీఎస్ ఆర్ కార్యక్రమాలు. సివిల్స్ కు సిద్ధమయ్యే విద్యార్థులకు లక్ష రూపాయల సాయం.. ప్రపంచ స్థాయి వ్యాపార విస్తరణ ప్రణాళికలు. రాగి, బంగారు గనుల తవ్వకాల దిశగా కొత్త అడుగులు. ఇది మొత్తంగా చెప్పాలంటే సిరుల మాగాణి చరిత్ర. ఇంత గొప్పగా ముందుకు సాగుతున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన సొంత పండుగ లాంటి 'సింగరేణి డే' విషయంలో మాత్రం ఈసారి కాస్త వెనకడుగు వేసినట్టు కనిపిస్తోంది.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ప్రతి ఏడాది డిసెంబర్ 23న సింగరేణి డేను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ రోజు అంటే కార్మికులకు ఒక పండుగ. కార్మికులు, వారి కుటుంబాలు, పిల్లలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఒకేచోట చేరి ఆనందంగా పాల్గొనేవారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగుల సన్మానాలు, సంస్థ భవిష్యత్ పై యాజమాన్యం మాటలు—— అన్నీ కలిసి సింగరేణి డేకు ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చేవి. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది.

### పొదుపు మంత్రంతో వేడుకలు

ఈసారి సింగరేణి ఆవిర్భావ వేడుకలను సాదాసీదాగా నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది. వేడుకలను కార్పోరేట్ , ఆయా జీఎం కార్యాలయ ఆవరణలకే పరిమితం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఏరియాల వారీగా నిర్వహించిన భారీ కార్యక్రమాలు ఈసారి ఉండవని తెలిపింది. ఇదే సమయంలో బడ్జెట్ కేటాయింపుల్లో కూడా భారీ కోత పెట్టింది. గతంలో ఒక్కో ఏరియాకు రూ.3 నుంచి రూ.3.5 లక్షలు, కార్పోరేట్ లో రూ. 10 లక్షల వరకు కేటాయించగా.. ఈసారి అదే బడ్జెట్ ను సుమారు 70 శాతం తగ్గించింది. ఉదాహరణకు కార్పోరేట్ ఏరియాకు గతంలో రూ.3.38 లక్షలు కేటాయించగా, ఈసారి కేవలం రూ.60 వేలకే పరిమితం చేసింది. మొత్తంగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న 15 ఏరియాలకు కలిపి ఈసారి కేవలం రూ.8 లక్షల బడ్జెట్ మాత్రమే కేటాయించడం గమనార్హం. గతంలో ఇది రూ.30 లక్షలకు పైగా ఉండేది.

### నిర్ణయం వెనుక కారణమేంటి..?

ఇప్పటివరకు సీఎండీగా కొనసాగిన ఎన్.బలరాం స్థానంలో కొత్త మేనేజింగ్ డైరెక్టర్ గా ఐఏఎస్ అధికారి దేవరరకొండ కృష్ణభాస్కర్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, సింగరేణి ఆర్థిక వనరులను పొదుపుగా వినియోగించుకోవాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనితో పాటు అసలు సింగరేణి దగ్గర డబ్బుల కొరత ఉందనే పుకారు కూడా షికారు కొడుతోంది. అయితే వాస్తవానికి గత నెల 29న యాజమాన్యం సింగరేణి డే ను ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఏరియాల వారీగా బడ్జెట్ కేటాయిస్తూ సర్క్యులర్ కూడా జారీ చేసింది. ఆ ఆదేశాల ప్రకారం ఇప్పటికే కొన్ని ఏరియాల్లో వెల్ బేబీ షో, ఉత్తమ గృహాలంకరణ, పర్యావరణం, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలను కూడా ఎంపిక చేశారు. ఇప్పుడు ఒక్కసారిగా బడ్జెట్ కోత విధించడంతో ఇప్పటికే నిర్వహించిన కార్యక్రమాల ఖర్చులు ఎలా భరించాలన్న దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది.

### కార్మిక సంఘాల ఆగ్రహం..

ఇదిలా ఉండగా, సింగరేణికి సంబంధం లేని క్రీడా కార్యక్రమాలకు రూ.10 కోట్ల వరకు కేటాయించి, సింగరేణి ఆవిర్భావ వేడుకల బడ్జెట్ ను భారీగా తగ్గించడం ఏమిటని కార్మిక సంఘాలు తప్పుపడుతున్నాయి. గతంలో మాదిరిగానే సింగరేణి డేను ఘనంగా నిర్వహించాలని గుర్తింపు యూనియన్ నాయకులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. "లాభాలు వచ్చినప్పుడు గొప్పలు. విస్తరణలప్పుడు భారీ ప్రణాళికలు. కానీ కార్మికుల కోసం ఉన్న ఒకే ఒక్క రోజుకు మాత్రం ఖర్చు చేయలేరా?" అన్న ప్రశ్న కార్మిక వర్గాల్లో వినిపిస్తోంది. సింగరేణి అంటే యంత్రాలు కాదు. గనులు కాదు. లాభాల లెక్కలు మాత్రమే కాదు. భూమి లోతుల్లో పనిచేసే కార్మికులే సింగరేణి బలం. ఆ కార్మికులను సంవత్సరానికి ఒక్కరోజు గౌరవించే వేడుక కూడా సాదాసీదాగా మారితే, సింగరేణి ప్రాధాన్యతలపై ప్రశ్నలు రావడం సహజమే. ఈసారి డిసెంబర్ 23... సింగరేణి డే నిజంగా పండుగలా జరుగుతుందా? లేదా కేవలం ఒక తేదీగానే మిగిలిపోతుందా? అన్న చర్చ ఇప్పుడు కార్మిక వర్గాల్లో జోరుగా సాగుతోంది.

| ఏరియా | గతంలో | ప్రస్తుతం |
|---|---|---|
| కార్పొరేట్ | 8.00 | 1.00 |
| కొత్తగూడెం | 3.38 | 0.60 |
| ఇల్లెందు | 2.25 | 0.50 |
| మణుగూరు | 3.38 | 0.60 |
| భూపాలపల్లి | 3.38 | 0.60 |
| ఆర్జీ–1 | 3.38 | 0.60 |
| ఆర్జీ–2 | 3.38 | 0.60 |
| ఆర్జీ–3 / ఎఎల్పీ | 2.82 | 0.55 |
| బెల్లంపల్లి | 2.25 | 0.55 |
| మందమర్రి | 3.38 | 0.60 |
| శ్రీరాంపూర్ | 3.38 | 0.60 |
| హైదరాబాద్ | 0.56 | 0.20 |
| సత్తుపల్లి | 0 | 0.50 |
| నైనీ | 0 | 0.35 |
| ఎస్టీపీపీ | 0.67 | 0.25 |



## గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో

# వంట గ్యాస్ భద్రతపై అవగాహన సదస్సు

- గ్యాస్ ప్రమాదాల నివారణపై విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన
- హెచ్‌పి గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీ నారాయణ.






**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 20(ప్రజా జ్యోతి ):**ప్రభుత్వ గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, బొల్లిరి గూడెంలో వంట గ్యాస్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌పి సి ఎల్ మరియు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్‌పి గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,హెచ్‌పి గ్యాస్ వినియోగదారులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు పొందాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. హెచ్‌పి గ్యాస్ కార్యాలయం నుండి వచ్చే డెలివరీ బాయ్ ద్వారా వినియోగదారుల ఇంటివద్దనే ఈ-కేవైసీ పూర్తిచేయడంతో పాటు, 2021 సంవత్సరానికి ముందు గ్యాస్ కనెక్షన్ తీసుకొని ఐదేళ్లు దాటిన వినియోగదారులు రూ.190 చెల్లించి సురక్ష గ్యాస్ పైప్‌ను బదిలీ చేసుకోవాలని తెలిపారు.అలాగే,హెచ్‌పి గ్యాస్ మెకానిక్ మాండేటరీ తనిఖీ ద్వారా వంటగదిలో ఉండాల్సిన ఏర్పాట్లు, గాలి వెలుతురు సరిపోతున్నాయా లేదా, వినియోగంలో ఉన్న రెగ్యులేటర్, స్టవ్,గ్యాస్ పైప్ పరిస్థితి వంటి అంశాలను పరిశీలిస్తారని చెప్పారు.తనిఖీకి రూ.236,కొత్త సురక్ష పైప్ బిగించుకునేందుకు రూ.190 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.ఇంటిలో అనుకోకుండా గ్యాస్ లీకేజీ కారణంగా ప్రమాదాలు భవించినట్లయితే,హెచ్‌పి సి ఎల్ నిబంధనల ప్రకారం వినియోగదారుడికి ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం అందుతుందని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500కే గ్యాస్ సిలిండర్ పొందవచ్చని తెలిపారు.మెకానిక్ ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించడం ద్వారా గ్యాస్ వల్ల జరిగే ప్రమాదాలను నివారించవచ్చని,ఈ-కేవైసీ చేయించుకోని వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో ఆటంకాలు కలగవచ్చని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌పి గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ,మెకానిక్ ప్రకాశ్,డెలివరీ బాయ్ సత్యనారాయణ,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ,పీడీ శ్రీనరేష్,ఉపాధ్యాయులు చెన్నారావు,కిషన్, సురేశ్, అనూష, గంగ,ఉష,లలిత,కళావతి, ఆదిలక్ష్మి,జ్యోతి,అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పర్సనల్ అధికారులు అన్ని వివరాలు ఆన్లైన్ చేయాలి

- అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్ష
- వీడియో కానఫరెన్స్ లో జిఎం(పర్సనల్) కిరణ్ కుమార్



**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 20 – ప్రజాజ్యోతి:**సింగరేణి ప్రధాన కార్యాలయంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ ఛాంబర్ నుండి జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో శనివారం నాడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షను నిర్వహించారు. ఈ సంధర్భముగా ఏరియాల వారీగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో కారుణ్యనియామకాల ద్వారా సంస్థలో నియామకమయ్యే వారసుల కు సంబందించిన ఓఎస్ఎల్ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆయన సూచించారు. సిఎంపిఎఫ్ / సిపిఆర్ఎంఎస్ యొక్క జీవన్ ప్రమాన్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్) రెన్యూవల్ ల గురించి ఈపిఆర్ నందు ఉద్యోగి జీవిత భాగస్వామి / కుటుంబ సభ్యుల యొక్క పూర్తి వివరాలను నమోదు చేయటం విషయాల గురించి సమీక్షించి, కారుణ్య నియమకాలు, టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియలను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణ రావు, ఎస్.వేంకటేశ్వర రావు, బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కే.ప్రవీణ్ కుమార్, సీనియర్ పిఓలు ఎం.శ్రీనివాస్, బి.రణదీప్ గౌడ్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, సీనియర్ ఆసిస్టెంట్ ఎం.శ్యామ్ కిరణ్, అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## దశావతారాల పూజా కార్యక్రమం



**చర్ల, డిసెంబర్ 20: (ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో శనివారం ఆయిల్ బంకు ఏరియాలోని మారుతీ నగర్ లో కల శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో శ్రీమహావిష్ణువుకు సంబంధించిన దశావతారాలలో భాగంగా మత్యావతారానికి సంబంధించిన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశికి ముందున ప్రతిరోజు సాయంత్రం వేళ మారుతి నగర్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో ఆ శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాలకు సంబంధించిన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దానిలో భాగంగా శనివారం ఆ శ్రీమహావిష్ణువు యొక్క మొదటి అవతారమైన మత్యావతారంలో మహావిష్ణువుని పూజిస్తూ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాలు ప్రతిరోజు ఒక్కొక్క అవతారంలో సాయంత్రం వేళ నిర్వహిస్తూ 29వ తారీకు వరకు కొనసాగుతాయని 30వ తారీకు ముక్కోటి ఏకాదశి కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించబడుతుందని కావున చర్ల మండల ప్రజలు ఆ శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాల పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి అనుగ్రహానికి ఆశీస్సులు కి పాత్రులు కావాలని కోరారు.

## శతాబ్ది మహోత్సవాల భాగంగా మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ గ్రామ సేవ యజ్ఞం

- గ్రామ సేవ యజ్ఞానికి అన్నపురెడ్డిపల్లి ప్రజల విశేష స్పందన





**అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 20, ప్రజా జ్యోతి:**మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ, కొత్తగూడెం ఆధ్వర్యంలో శతాబ్ది మహోత్సవాల సందర్భంగా చేపట్టిన గ్రామ సేవ యజ్ఞం 2025–26 కార్యక్రమం అన్నపురెడ్డిపల్లి మండలంలో గల రామాలయం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు యజ్ఞం, హోమం నిర్వహించగా, హోమం అనంతరం గ్రామ సేవ యజ్ఞం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనమా గాంధీ దంపతులు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. రామాలయం కమిటీ సభ్యులు కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమానికి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి వందమందికి పైగా ప్రజలు పాల్గొని తమ ఆరోగ్య సమస్యలను వివరించారు. సేవా సంస్థకు చెందిన వైద్య నిపుణులు ప్రజల ఆరోగ్య సమస్యలను పరిశీలించి తగిన సూచనలు అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు రవిచంద్ర, శ్రీధర్ రావు, వీరమల్లు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీమన్నారాయణ, రవికాంత్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని పాల్గొన్న ప్రజలు తెలిపారు. గ్రామ స్థాయిలో ఇలాంటి ఉచిత ఆరోగ్య సేవలు అందించడం వల్ల ప్రజలకు వైద్యంపై అవగాహన పెరిగిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో ప్రజలు వనమా గాంధీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మండలంలోని మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి గ్రామ సేవ యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమం మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ సేవా భావానికి నిదర్శనంగా నిలిచింది.

## సిపిఐలో చేరిన కోడిపుంజుల వాగు సర్పంచ్ మహేశ్వరి

- కండువా కప్పి ఆహ్వానించిన కూనంనేని సాంబ శివరావు



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 20(ప్రజా జ్యోతి ):**కోడిపుంజుల వాగు గ్రామ నూతన సర్పంచ్ అజ్మీర మహేశ్వరి శ్రీనివాస్ శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో చేరారు.స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబ శివరావు మహేశ్వరికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ,నియోజకవర్గంలో సిపిఐ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన కోడిపుంజుల వాగు సర్పంచ్ మహేశ్వరి సిపిఐలో చేరడం అభినందనీయమన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామపంచాయతీ పాలన సాగాలని,రాగద్వేషాలకు తావు లేకుండా పారదర్శకతతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.పేదల పక్షాన నిరంతరం పోరాడే సిపిఐ కుటుంబంలోకి మహేశ్వరి చేరడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ప్రజల పక్షాన చేపట్టే ప్రతి మంచి కార్యక్రమానికి సిపిఐ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. మహేశ్వరి చేరికతో స్థానిక సంస్థల్లో సిపిఐ బలం మరింత పెరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ భాష,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం,మండల కార్యదర్శి వీశం శెట్టి పూర్ణచంద్రరావు,గుండాల నాగరాజు,మన్యం వెంకన్న,అజ్మీర రాములు నాయక్,అజ్మీర శ్రీనివాస్ నాయక్,బాదావత్ వెంకటరామ్, బాదావత్ రాములు,బాదావత్ రాంజీ,గూగులోత్ రాములు, బాదావత్ లక్పతి,బానోత్ చందు, అజ్మీర బాలు,అజ్మీర కృష్ణ,తేజవత్ రమేష్,లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

## పదవి ఉన్నా .. లేకున్నా ప్రజల కోసం పనిచేస్తా

- మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యా నాయక్



**టేకులపల్లి, డిసెంబర్ 20, ప్రజా జ్యోతి :** తనకు పదవి ఉన్నాలేకున్నా ప్రజల కోసం , ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని మాజీ సర్పంచ్ , తాజా ఎన్నికల్లో టేకులపల్లి సర్పంచ్ గా పోటీ చేసి ఓడిపోయిన ఇస్లావత్ రెడ్యా నాయక్ అన్నారు. తనకు ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసాడు. ఈమేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని తెలిపారు . స్వంత పార్టీ లోని కొందరు వల్ల ఓడిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి టేకులపల్లి పంచాయతీ ఉన్నప్పుడే నేను ఒకసారి, నా భార్య పార్వతి ఒకసారి సర్పంచ్ గా గెలిచామని గుర్తు చేశారు. మూడో సారి మా కుటుంబం నుంచి ప్రజలకు సేవా చేయాలనీ ప్రయత్నం చేశామని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల ప్రజలకు తానూ ఎలాంటి అన్యాయం చేయలేదని , అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూనే ఉన్నానని స్పష్టం చేసారు. పంచాయతీ అభివృద్ధి విషయం లో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన మర్రికుంట యువకుడు



**బూర్గంపహాడ్, డిసెంబర్ 20, (ప్రజా జ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మర్రికుంట గ్రామానికి చెందిన బొర్రా లోకేష్ పాల్వంచలోని కిన్నెరసాని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. ఇటీవలే పెద్దపల్లిలో జిల్లా స్థాయిలో జరిగిన ఎస్జిఎఫ్ వాలీబాల్ అండర్ –14 ప్రతిభ కనబరిచడం తో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం ఆ గ్రామానికి గర్వకారణంగా మారింది. కఠిన సాధన, క్రమశిక్షణతో ఆటలో రాణిస్తూ సెలెక్షన్ సాధించిన యువకుడిని గ్రా మస్తులు, క్రీడాభిమానులు అభినందించారు. ఈ విజయం మర్రికుంట గ్రామంలోని యువతకు ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## శబరిమల కు బయలుదేరిన అయ్యప్పలు



**గుండాల ప్రజా జ్యోతి. 20.** ఇరుముడి కట్టుకొని శబరిమలకు అయ్యప్పలు బయలుదేరారు శనివారం మండల కేంద్రంలో నీ రామాలయంలో 41 రోజులు మాల ధరించి దీక్ష చేసిన అయ్యప్పలు ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయలుదేరి వెళ్లారు నటరాజ్ శర్మ గురు స్వామి ఆధ్వర్యంలో స్వాముల తో హోమం అయ్యప్పకు అభిషేకం నిర్వహించి పూజలు చేసిన అనంతరం స్వాములకు ఇరుముడి కట్టారు 41 రోజులపాటు కట్టిన దీక్షపూనిన అయ్యప్ప లకు ఘనంగా రామాలయంలో ఇరుముడి కట్టి పూజలు నిర్వహించిన అనంతరం మండల కేంద్రంలో నగర సంకీర్తన చేశారు ఈ కార్యక్రమంలో యాసారపు రవి సురేష్ గుండెబోయిన లక్ష్మీనారాయణ యాకయ్య మానాల ఉపేందర్ పిల్లి కృష్ణ నూకరాజు కలాం కార్తీక్ రమేష్ శ్రీను గోపాల్ సుధాకర్ వ్యాసారపు శ్యాం సన్నీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతం

- పాల్గొన్న ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 20, ప్రజా జ్యోతి**

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (డీఎం సీఆర్ హెచ్ఆర్డీ) ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ సమన్వయ సమస్త సహకారంతో సమాచార హక్కు చట్టం పై రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శనివారం తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టం యొక్క లక్ష్యాలు, ప్రాధాన్యత, చట్టంలోని ముఖ్య నిబంధనలు, పౌరుల హక్కులు, ప్రభుత్వ అధికారుల బాధ్యతలు, సమాచారాన్ని అందించడంలో పాటించాల్సిన విధానాలు, అప్పీల్స్ ప్రక్రియ తదితర అంశాలపై నిపుణులచే సమగ్ర అవగాహన కల్పించారు.శిక్షణ కార్యక్రమం రెండో రోజు సందర్భంగా సమాచార హక్కు చట్టం అవసరత, పారదర్శకత, బాధ్యతాయుత పాలనలో ఆర్టీఐ చట్టం పాత్రపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాచార హక్కు చట్టం అత్యంత కీలకమని, ప్రజలకు సమయానుకూలంగా సరైన సమాచారం అందించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ తెలిపారు. అధికారులు చట్టాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని విధి నిర్వహణలో నిబద్ధతతో అమలు చేయాలని ఆయన సూచించారు.అనంతరం శిక్షణ కార్యక్రమంలో విజయవంతంగా పాల్గొన్న ఉద్యోగులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వ సేవల నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.ఈ సమావేశంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ మేనేజర్ ఆనంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ కొండలరావు, శిక్షకులు మోహన్ కృష్ణతో పాటు వివిధ శాఖలకు చెందిన మొత్తం 82 మంది ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ ఆత్మీయ సమ్మేళనము









**చర్ల, డిసెంబర్ 20: (ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో శనివారం జవ్వాది గ్రౌండ్స్ లో ఆత్మీయ హిందూ సమ్మేళన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ ఎస్ ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్, శ్రీ దత్త పీఠాదిపతి శ్రీ సాయిదత్త నాగానంద సరస్వతి మహరాజ్, శ్రీ నృసింహ సేవావాహిని వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్యానంద స్వామి పాల్గొన్నారు . చర్ల లోని త్రికూట దేవాలయం సమీపంలోని జవ్వాది గ్రౌండ్స్ లో జరిగిన ఈ ఆత్మీయ హిందూ సమ్మేళనంలో వేలాది మంది హిందువులు పాల్గొన్నారు .ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ప్రతి హిందువు వ్యక్తిగత స్వార్థం విడిచి జాతి ఐక్యతకు కృషి చేయాలని అందరు కలిసికట్టుగా ఉండి మన సంస్కృతిని పరిరక్షించుకోవాలని అన్నారు . "ధర్మో రక్షతి రక్షితః" అనే ధర్మాన్ని మనందరం పాటించినట్లే ఆ ధర్మమే మనందరినీ కాపాడుతుందని ధర్మాన్ని మనం ఎప్పుడైతే విస్మరిస్తామో ఆ ధర్మమే మనల్ని నాశనం చేస్తుందని కావున ధర్మాన్ని పాటించే వారే ప్రశాంతంగా జీవిస్తారని స్వార్థంతో ఉండేవారు ప్రశాంతంగా జీవనం గడపరని పేర్కొన్నారు. భరతమాత దగ్గర ధర్మం ఉన్నన్ని రోజులు మనకు శ్రీరామరక్షగా నిలుస్తుంది అన్నారు. ధర్మం తప్పి పక్కకు రావద్దని ఇతరుల మాయలో పడవద్దని సూచించారు. మనదేశంలో ధర్మాన్ని రక్షించే ప్రధాని పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. హిందుత్వం నిలబడి ఉన్నంతసేపు అందరికీ బాగుంటుందని మనమంతా కలసిఉంటే దేశం బలంగా ఉంటుందని ఈ ప్రపంచంలోనే రాబోయే రోజుల్లో ఆరాధ్య క్షేత్రంగా అయోధ్య మారుతుందని హిందువులు గొర్రెల మందలు కారని గర్జించే సింహాలు అనే సమయం ఆసన్నమైందన్నారు. జైశ్రీరామ్ అనే నినాదంతో గర్జిస్తూ హిందువునని గర్వంగా చెప్పుకునే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. ధర్మాన్ని ఆచరించి రక్షించుకుందామని అన్నారు . స్వామి వివేకానంద అమెరికాలో మాట్లాడుతూ హిందువుగానే జీవిద్దామని మతాన్ని మార్చుకోవద్దని అన్నారని గుర్తు చేశారు. ఆయన అడుగు జాడలలో పయనిద్దామని పిలుపునిచ్చారు. ధర్మాన్ని ఆచరిస్తే ప్రపంచంలో ఎవరైనా మోక్షం పొందుతారని తెలిపారు. కేవలం హిందూ ధర్మంలోనే మహిళలను పూజిస్తారని శ్రేష్టమైన ధర్మం కేవలం మనదేశంలోనే వికసించిందని భరత భూమిలో హిందువుగా పుట్టడం మన అదృష్టమని పేర్కొన్నారు. భగవంతుడిచేత భరత భూమి రక్షించబడుతుందని కులం పేరుతో విడిపోయిన సమాజాన్ని సంఘటితం చేయాలని అన్నారు . రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభమై నూరేళ్లయిన సందర్భంగా దేశవ్యాప్తంగా 60 వేల హిందూ సమ్మేళనాలను నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 50 పైగా హిందూ సమ్మేళనాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ గత వందేళ్లుగా జాతి సంఘటితం కోసం కృషి చేస్తున్న దేశభక్తి గల సంస్థ అని తెలిపారు. ఈ సంస్థకు ప్రతి హిందువు అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. నీది, నాది, నా ఇల్లు అనే భావన పోయి మనం, మన దేశం అనే భావన ఆర్ఎస్ఎస్ ద్వారా సంక్రమించుకుందని తెలిపారు. మన అందరికీ రాముడే ఆదర్శప్రాయం అన్నారు. రాముడిని స్మరిస్తే అద్భుతమైన కుటుంబ వ్యవస్థ గుర్తుకు వస్తుందని అన్నారు. దేశంలో రామరాజ్య స్థాపన ధ్యేయంగా మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు మహిళలకు అవమానం జరుగకుండా ఉంటే అదే రామరాజ్యమని స్పష్టం చేశారు. రాముడు అంటే ప్రకృతిని పూజించడం అని నిజమైన రామరాజ్యంలో ప్రకృతిని కాపాడుకుంటూ జీవనం సాగించాలని ఇందుకు ప్రతి హిందూ కుటుంబం ఒక మొక్కను నాటి పెంచి పోషించాలన్నారు. రాముడు, కృష్ణుడు లను పూజించడం అంటే నిమ్న వర్గాలను గౌరవించడమేనని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ప్రభుత్వం, పోలీసులు సూచించిన నియమాలను పాటించాలన్నారు. పిల్లలకు ఇంటి వద్ద ధర్మాన్ని బోధించాలని మన ఇంటి నుండే ధర్మ ప్రచారం ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్ విబాగ్ ప్రచారక్ సేవూరి రామచంద్రరావు, చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, హిందూ సమ్మేళన ఉత్సవ కమిటీ సభ్యులు మల్లాది శ్రీరామ్మూర్తి, శివ్వారపు నరేష్, పెద్దాడ ఆశాలత, సురేష్ పాల్గొన్నారు.